TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 119 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ ఆదివారం.23.11.2025 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD




"శ్రీ కృష్ణ, కార్తికేయ,దత్తాత్రేయ,హనుమాన్ విగ్రహా ప్రతిష్టాపన మహోత్సవం
" తేదీ నవంబర్ 24,25,26, శ్రీ కిషన్ మహారాజ్ శ్రీ నవశక్తి దుర్గామాత మందిరం ఆదిలాబాద్

## అంతర్జాతీయ స్థాయిలో గ్లోబల్ సమ్మిట్




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ఘనంగా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 8, 9 తేదీల్లో ప్రభుత్వం ఏర్పడి రెండేండ్లు పూర్తయిన సందర్భంగా గ్లోబల్ సమ్మిట్ పేరుతో విజయోత్సవాలను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. దీని ఏర్పాట్లపై శనివారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి సీఎంవో అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్‌రంజన్, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేండ్లు పూర్తయిన నేపథ్యంలో విజయోత్సవాలను ప్రతిబింబించేలా ఫ్యూచర్ సిటీలో విశాలమైన ప్రాంగణంలో భారీ వేదిక ఏర్పాటు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు.గ్లోబల్ సమ్మిట్ అందరినీ ఆకట్టుకునే అంతర్జాతీయ స్థాయి ఉత్సవాన్ని తలపించేలా ఉండాలని చెప్పారు. డిసెంబర్ 8న చేపట్టే కార్యక్రమాలు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల విజయాన్ని చాటి చెప్పేలా ఉండాలన్నారు. డిసెంబరు 9న జరిగే కార్యక్రమంలో తెలంగాణ భవిష్యత్తు దార్శనికత, భవిష్యత్తు ప్రణాళికలు పొందుపరిచిన తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంటును ఆవిష్కరించే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఇదే ప్రాంగణంలో తెలంగాణలో పారిశ్రామిక విధానాన్ని, పెట్టుబడులకు ఇస్తున్న ప్రాధాన్యతను ప్రపంచానికి చాటిచెప్పేలా రౌండ్ టేబుల్ సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. అన్ని విభాగాలు తమ భవిష్యత్ లక్ష్యాలను కండ్లకు కట్టించే ఆడియో, వీడియో ప్రదర్శనలు, ప్రెజెంటేషన్లు తయారు చేసుకోవాలని సూచించారు. దేశ విదేశాలకు చెందిన ప్రముఖులు, అన్ని రంగాల్లో పేరొందిన పారిశ్రామికవేత్తలను ప్రత్యేకంగా ఆహ్వానించాలని అధికారులను ఆదేశించారు.వేడుకలకు వచ్చిన అతిథులకు తగిన వసతి సదుపాయాలతో పాటు అత్యున్నత భద్రత కల్పించాలని చెప్పారు. ఏర్పాట్లలో ఎక్కడా లోటుపాట్లు లేకుండా చూడాలనీ, అన్ని విభాగాలు సమన్వయంతో ఈ వేడుకలను విజయవంతం చేయాలని సూచించారు. 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దటంలో క్రియాశీల పాత్ర పోషించాల్సిన అన్ని విభాగాలు గ్లోబల్ సమ్మిట్లో కీలక భాగస్వాములు కావాలని తెలిపారు. భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకోవటం, రైజింగ్ డాక్యుమెంట్‌లో పొందుపరిచే ప్రతి అంశంపై లోతైన అధ్యయనం చేసుకోవాలని అధికారులను సీఎం అప్రమత్తం చేశారు. ఈ ప్రణాళికపై ఈనెల 25 నుంచి తానే స్వయంగా వరుస సమీక్షలు నిర్వహిస్తానని తెలిపారు. ఇప్పటికే ప్రజాభిప్రాయాలు, సలహాలు సూచనలతో పాటు అన్ని రంగాల్లోని నిపుణుల దూరదష్టితో తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్ 2047 రూపకల్పన జరిగిందని సీఎం తెలిపారు. వివిధ విభాగాల అధికారులతో నిర్వహించే సమీక్షల్లో వచ్చే విలువైన సలహాలు, నిర్దిష్టమైన సూచనలను పొందుపరిచి డాక్యుమెంట్‌కు తుదిరూపం ఇస్తామని ప్రకటించారు.

## యువతకు వృత్తినైపుణ్యాలపై ఫోకస్



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: యువతకు వృత్తినైపుణ్యాల్లో మెరుగైన శిక్షణ ఇచ్చేలా విద్యా వ్యవస్థలో సమూల మార్పు తేవాలన్నదే ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ప్రస్తుత మార్కెట్ అవసరాలకు అనుగుణంగా మానవ వనరులను తీర్చిదిద్దేందుకు స్కిల్లింగ్, రీ- స్కిల్లింగ్, అప్- స్కిల్లింగ్‌పై ప్రధానంగా దృష్టి సారించామన్నారు. కూకట్‌పల్లిలోని జేఎన్‌టీయూహెచ్ ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన 'గ్లోబల్ అలూమ్ని మీట్ - 2025'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్వాంటం కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, ఏఐ తదితర కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్‌లో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేలా 'ఎకో సిస్టం'ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. దానిలో భాగంగానే 'తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్'ను అందుబాటులోకి తెస్తున్నామని చెప్పారు. జేఎన్‌టీయూహెచ్‌లో ఏఐ, క్వాంటం కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్, ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్ ఫండింగ్, రీసెర్చ్ క్లస్టర్స్, ఇంటర్నేషనల్ మెంటార్ షిప్ నెట్ వర్క్, గ్లోబల్ అలూమ్ని కౌన్సిల్ ఏర్పాటు చేసేందుకు పూర్వ విద్యార్థులు ముందుకు రావాలని కోరారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. యువ ఇంజనీర్ల ఆలోచనావిధానం మారాలనీ, ఉద్యోగార్థిగా కాకుండా పదిమందికి ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదగాలని మార్గనిర్దేశం చేశారు. పుస్తక జ్ఞానమే కాకుండా ప్రాక్టికల్, ప్రాబ్లం సాల్వింగ్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మెన్ ప్రొఫెసర్ వీ బాలకిష్టారెడ్డి, జేఎన్‌టీయూహెచ్ వీసీ ప్రొఫెసర్ టీ కిషన్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కే వెంకటేశ్వరరావు, రెక్టార్ డాక్టర్ కే విజయ్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అందెశ్రీ ఓ కోహినూర్ వజ్రం




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: 'ఎన్ని వజ్రాలున్నా కోహినూర్ వజ్రానికి పోటీలేదు. కవులు, కళాకారులు ఎంత మంది ఉన్నా తెలంగాణ చరిత్రలో అందెశ్రీ ఒక కోహినూర్ వజ్రం. ఆయన కీర్తిని భవిష్యత్‌లో నిలబెడతాం'అని ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర గీత రచయిత అందెశ్రీ సంతాపసభను శనివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించింది. ముఖ్యఅతిథిగా హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ అందెశ్రీ తనకు అత్యంత అప్తుడు, మనసుకు దగ్గరి వాడని అన్నారు. తెలంగాణ సమాజం చైతన్యవంతమైనదని చెప్పారు. ఎంత అమాయకంగా కనిపించినా అవసరమైనప్పుడు పోరాట పటిమను ప్రదర్శిస్తుందన్నారు. రాచరికం, ఆధిపత్యం హద్దు మీరినప్పుడు కవులు, కళాకారులు తమ గొంగడి దుమ్ము దులిపి పోరాటంలోకి దూకారని అన్నారు. నిజాంకు వ్యతిరేకంగా 'బండెనక బండి కట్టి 16 బండ్లు కట్టి ఏ బండ్ల పోతవ్ కొడకో నైజాం సర్కరోడా' అని బండి యాదగిరి గళం విప్పితే నిజాం సర్కార్ పీఠం కదిలిందని గుర్తు చేశారు.

సమైక్యవాదులకు వ్యతిరేకంగా గద్దర్, గోరేటి వెంకన్న, గూడ అంజన్న, అందెశ్రీ తెలంగాణ విముక్తి కోసం మలిదశ ఉద్యమానికి పునాదులు వేశారని చెప్పారు. బడి మొహం చూడని అందెశ్రీ రాసిన జయజయహే తెలంగాణ గీతాన్ని రాసి స్ఫూర్తిని నింపారని అన్నారు. ప్రపంచంలో ఏ మూలన ఉన్నా ప్రతి తెలంగాణ గుండెకు తాకేలా ఈ పాటను రాసి ఉద్యమ స్ఫూర్తిని నింపారని వివరించారు. అందెశ్రీ లాంటి వారు లేకుండా తెలంగాణ ఉద్యమం జరగలేదనీ, ప్రత్యేక రాష్ట్ర సాధన కల సాకారం కాలేదని చెప్పారు. జయజయహే తెలంగాణ పాటను రాష్ట్ర అధికార గీతంగా అందరూ భావించారని గుర్తు చేశారు. కానీ నాటి పాలకుల తీరు వల్ల జయజయహే తెలంగాణ పాట మూగబోయిందని అన్నారు. అధికారం శాశ్వతం అని నాటి పాలకులు భావించారని అన్నారు. తెలంగాణలో స్ఫూర్తిని నింపిన కవులు, కళాకారుల గానం తెలంగాణలో వినిపించకుండా కుట్ర చేశారని విమర్శించారు. పెన్నే కదా అని మన్ను కప్పితే గన్నులై మొలకెత్తుతాయనీ, గడీలను కుప్పకూల్చుతామని అందెశ్రీ నిరూపించారని చెప్పారు.

### నేడు జయజయహే తెలంగాణ నిత్యగానం

ఇప్పుడు తెలంగాణ నాలుగుకోట్ల ప్రజలు జయజయహే తెలంగాణ పాటను నిత్యం పాడుకుంటున్నారని రేవంత్‌రెడ్డి అన్నారు. బడి మొహం చూడని అందెశ్రీ రాసిన ఆ పాటను ప్రతిబడిలో రోజూ పాడుతున్నారని వివరించారు. ఆ పాటను ప్రతి బడిలో వాడాలనీ, ప్రతి ఒక్కరూ పాడాలని చెప్పారు. తాను సీఎం, తన సహచర మంత్రులు అయ్యారంటే వారి స్ఫూర్తి ఎంతో ఉందన్నారు. అందెశ్రీ కుటుంబాన్ని ఆదుకోవడం తన బాధ్యత అని అన్నారు. ఆ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చామనీ, స్మృతివనం నిర్మిస్తున్నామని వివరించారు. ఆయన రాసిన 'నిప్పుల వాగు' పుస్తకాన్ని ప్రతి గ్రంథాలయంలో ఉండేలా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో ప్రజాపాలన రావాలని గద్దర్, అందెశ్రీ కోరుకున్నారని అన్నారు.

### మంత్రుల్లో రెడ్లు 20 శాతం దళితులు 27 శాతం

తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన తొమ్మిది కవులకు 300 గజాల ఇంటిస్థలం ఇచ్చామనీ, భారత్ ఫ్యూచర్ సీటీలో వారికి ఇంటిని నిర్మించి ఇస్తామని రేవంత్‌రెడ్డి చెప్పారు. దేశంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని అన్నారు. సాంకేతిక, న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తకుండా అమలు చేస్తున్నామని వివరించారు. వర్గీకరణ అమలు వల్ల దళితుల్లో అత్యంత వెనుకబడిన వాళ్లు డాక్టర్లు, ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు అవుతున్నారని చెప్పారు. చిన్న ఉద్యోగాలకే పరిమితం కాకుండా భవిష్యత్‌లో ఐఏఎస్, ఐపీఎస్‌లుగా రాణించాలని ఆకాంక్షించారు. తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

తన మంత్రివర్గంలో రెడ్లు ముగ్గురు మంత్రులుగా ఉంటే దళితులు నలుగురు ఉన్నారనీ, స్పీకర్ కూడా ఉన్నారని గుర్తు చేశారు. మంత్రుల్లో రెడ్లు 20 శాతం ఉంటే దళితులు 27 శాతం ఉన్నారని వివరించారు. దళితుల సమస్యలు, పరిశోధనలపై ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎస్సీ సంక్షేమ అభివృద్ధి శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్సీ కోదండరామ్, మాజీమంత్రి మోత్కుపల్లి నర్సింహులు, మాజీఎంపీ వీహెచ్, గాయకురాలు విమలక్క, ఓయూ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ సి కాశీం, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, సాంస్కృతిక సారథి వెన్నెల గద్దర్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర డీజీపీ ఎదుట 37మంది మావోయిస్టుల లొంగుబాటు




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి ఎదుట 37 మంది మావోయిస్టులు శనివారం లొంగిపోయారు. ఇందులో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు ఉండగా.. మిగతా 34 మంది వివిధ క్యాడర్‌కు చెందినవారున్నారు. ఇందులో పెద్ద సంఖ్యలోనే మహిళలు ఉన్నారు. డీజీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో లొంగిపోయి న మావోయిస్టులను పోలీసు అధికారులు హాజరుపర్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర డీజీపీ బత్తుల శివధర్‌రెడ్డి మాట్లాడుతూ.. మావోయి స్టుల సిద్ధాంతానికి మనుగడ లేదనీ, మారుతున్న కాలానికి అనుగుణంగా వారిలో మార్పు వచ్చి జనజీవన స్రవంతిలో కలవాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలో ఇచ్చిన పిలుపుమేరకే 37 మంది మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిశారని చెప్పారు. ప్రస్తుతం లొంగిపోయిన వారిలో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులున్నారనీ, వారిలో కొయ్యద సాంబయ్య ఎలియాస్ ఆజాద్, అప్పాసీ నారాయణ ఎలియాస్ రమేశ్, నూపో గంగ ఎలియాస్ నీలేశ్‌లు ఉన్నారనీ, మిగతావారిలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వివిధ కమిటీ సభ్యులు ఉన్నారని ఆయన వివరించారు. వీరి వద్ద ఒక ఏకే-47, రెండు ఎస్ఎల్ఆర్‌లు, నాలుగు పాయింట్ 303 రైఫిల్స్‌తో కలిపి మొత్తం ఎనిమిది ఆయుధాలున్నాయని తెలిపారు.

### 32 ఏండ్లుగా అజ్ఞాతంలోనే..!

సాంబయ్య ములుగు జిల్లాకు చెందినవారు కాగా అప్పాసీ నారాయణ పెద్దపల్లి జిల్లా రామగుండం కు చెందినవాడని చెప్పారు. దాదాపు 32 ఏండ్లుగా వీరు అజ్ఞాత ఉద్యమంలో ఉన్నారని అన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యులు ముగ్గురు ఒక్కొక్కరిపై రూ.20 లక్షల రివార్డు ఉన్నదనీ, మిగతావారికి సంబంధించి ఆయా రాష్ట్రాల్లో పేర్కొన్న రివార్డులు ఉన్నాయని తెలిపారు. వీరికి ఈ రివార్డులను వెంటనే అందజేయటం జరుగుతున్నదని ఆయన చెప్పారు.

### హిడ్మా లొంగుబాటు ఆరోపణల్లో నిజం లేదు

మావోయిస్టు మాజీ ప్రధాన కార్యదర్శి గణపతి ఎలియాస్ ముప్పాల లక్ష్మణ్‌రావు, మరో అగ్రనాయకుడు తిప్పిరి తిరుపతి ఎలియాస్ దేవోజీల లొంగుబాటుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నామని ఒక ప్రశ్నకు బదులిచ్చారు. ప్రస్తుతం మావోయిస్టు కేంద్ర కమిటీలో రాష్ట్రానికి చెందిన ఐదుగురు గణపతి, దేవోజీ, రాజిరెడ్డి, నరహరి, హనుమంతులు కేంద్ర కమిటీ సభ్యులుగా ఉన్నారనీ, మరో పది మంది రాష్ట్ర కమిటీ సభ్యులతో కలిపి మొత్తం 59 మంది తెలంగాణ రాష్ట్రానికి చెందిన మావోయిస్టులు ఉన్నారని డీజీపీ వివరించారు.

## దమ్ముంటే నిరూపించు..లేదంటే క్షమాపణ చెప్పు




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: అమృత్ తెలంగాణ: ఆరోపణలు చేయడం, అబద్ధాలు ప్రచారం చేయడంలో బీఆర్ఎస్ నాయకులు కే తారకరామారావు, టీ హరీశ్‌రావుకు వెన్నతో పెట్టిన విద్య అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు విమర్శించారు. ఈ మేరకు శనివారంనాడొక పత్రికాప్రకటన విడుదల చేశారు. విశ్వసనీయత లేని బీఆర్ఎస్ నేతలు పదేపదే ప్రస్తావిస్తున్న రూ.5 లక్షల కోట్ల స్కాం ఆరోపణ పూర్తిగా నిరాధారం, అవాస్తవమని స్పష్టం చేశారు. దమ్ముంటే ఆధారాలను బయటపెట్టి మాట్లాడాలనీ, రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. 2023 ఆగస్టులో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన ఫ్రీహోల్డ్ జీవోలు19, 20, 21 వెనుక ఉన్న లక్షల కోట్ల మతలబు ఏంటని ప్రశ్నించారు. వారిచ్చిన జీవోల ప్రకారం రెగ్యులరైజ్ అయిన భూముల్లో జోన్ మార్పిడికి సంబంధించి విధించిన 50, 30 శాతం చార్జీలతో రాష్ట్ర ఖజానాకు రూ. 4వేల కోట్ల నుంచి రూ.5 వేల కోట్ల వరకు ఆదాయాన్ని సమకూర్చేందుకు తాము ప్రయత్నిస్తు న్నామన్నారు. కుంభకోణాలు అలవాటైన బీఆర్ఎస్ నేతలకు అందరూ వారిలాగే ఉంటారని భావిస్తున్నారని ఎద్దేవా చేశారు.గత అసెంబ్లీ ఎన్నికలకు నాలుగు నెలల ముందు ప్రభుత్వ లీజ్ ల్యాండ్స్‌కు ఫ్రీహోల్డ్ రైట్స్ ఇచ్చి, 100 - 200 శాతం ఛార్జీలు విధించి మీరు వసూలు చేద్దామనుకున్న రూ.లక్షల కోట్ల సంగతేంటని నిలదీశారు. ప్రభుత్వంతో సంబంధం లేని సీఎం రేవంత్‌రెడ్డి సోదరులపై ఆరోపణలు చేస్తే రాష్ట్ర ప్రజలు నమ్ముతారనే భ్రమ నుంచి బయటకు రావాలని హితవు పలికారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా యువతకు ఉద్యోగాలు దక్కకుండా ఎందుకు అడ్డుకుంటున్నారో సమాధానం చెప్పాలని నిలదీశారు. వాస్తవాలను దాచిపెట్టి తమ ప్రభుత్వం 9,292 ఎకరాలు అమ్మకానికి పెట్టిందంటూ చేస్తూ ప్రజల్ని తప్పుతోవ పట్టిస్తున్నారన్నారు.

# కౌలు రైతులకు సోయా – మొక్కజొన్న కొనుగోలులో సడలింపు

## ఆన్లైన్ OTP విధానంతో విక్రయం జిల్లా కలెక్టర్ రాజర్షి షా



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా




హాజరైన అధికారులు

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి కౌలు రైతుల కోసం ప్రభుత్వం పెద్ద ఎత్తున సదుపాయాలు కల్పిస్తోందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్ శాఖలతో సమీక్ష నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కౌలు రైతులు పత్తితోపాటు సోయాబీన్, మొక్కజొన్న పంటలను కూడా %బూ% విధానంతో విక్రయించుకునే అవకాశం కల్పించామని తెలిపారు. ఈ విషయాన్ని ప్రతి మండలంలో రైతులకు చేరేలా విస్తృత ప్రచారం చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఎకరాకు 7 క్వింటాళ్లకుపైగా దిగుబడి వచ్చిన రైతులకు 12 క్వింటాళ్ల వరకు అమ్మేలా AEO లు నిర్ధారించాలి అని అన్నారు. డిజిటల్‌గా నమోదు కాని (NDS) కౌలు రైతులకు మద్దతు ధరతో పంటల విక్రయం చేసుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక అనుమతి ఇచ్చిందని కలెక్టర్ తెలిపారు. RSSS పోర్టల్‌లో నమోదైన రైతుల వివరాలు నేరుగా అగ్రి-MSP పోర్టల్‌కు లింక్ చేశామని వెల్లడించారు. మార్కెట్‌కు వచ్చినపుడు రైతులు ఆధార్, బ్యాంక్ పాస్‌పుస్తకం వివరాలను పోర్టల్‌లో పొందుపరిచి నమోదు చేయాలని, తర్వాత బయోమెట్రిక్ ధృవీకరణ ఆధారంగా పంట కొనుగోలు చేసి తక్కట్టు పత్రం జారీ అవుతుందని చెప్పారు. కౌలు రైతులు రైతు భరోసా ఆన్లైన్ వ్యవస్థ ద్వారా మార్క్‌ఫెడ్ కొనుగోళ్లకు అనుసంధానమైందని తెలిపారు. రైతులు వ్యవసాయ అధికారులను సంప్రదించి తమ వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు. సందేహాల నివృత్తికి 6300001597 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. జిల్లాలో వ్యవసాయ యంత్రాంగం కోసం 5,193 వ్యవసాయ పనిముట్లకు రూ. 380 లక్షలు మంజూరు చేశామని కలెక్టర్ తెలిపారు. సన్న, చిన్నకారు, ఎస్సీ–ఎస్టీ మహిళా రైతులకు 50 శాతం సబ్సిడీ, ఇతరులకు 40 శాతం సబ్సిడీపై రోటావేటర్లు, కల్టివేటర్లు, బ్యాటరీ స్ప్రేయర్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. దరఖాస్తులు తక్కువగా ఉన్న మండలాల్లో ప్రచారం పెంచాలని ఆదేశించారు. రైతుల ఆదాయం పెంచడం, ఆధునిక వ్యవసాయం ప్రోత్సహించడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఆయిల్ ఫామ్ లక్ష్యం సమిష్టిగా పూర్తి చేయాలని, సమగ్ర ఉద్యాన మిషన్ లక్ష్యం లోగా జనవరిలోగా పూర్తి చేయాలని అన్నారు. కూరగాయల నారు లక్ష్యం డిసెంబరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అదనంగా 2,000 స్ప్రింక్లర్ సెట్లు పొందేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్, ఉద్యాన అధికారి నర్సయ్యతో పాటు విభాగాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల సేవలందించడంలో విజ్ఞాన్ ప్రత్యేక పాఠశాల ప్రతినిధులు చూపుతున్న సేవ భావన ప్రశంసనీయం అని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు.



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి శనివారం జిల్లా కేంద్రంలోని యోగా భవన్‌లో విజ్ఞాన్ ప్రత్యేక పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన తల్లిదండ్రుల అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి, కార్యక్రమాన్ని ప్రారంభించి సరస్వతి దేవి చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రత్యేక అవసరాలున్న పిల్లలను సంరక్షించడం ఓ గొప్ప సేవ అని పేర్కొన్నారు. ఎటువంటి ప్రత్యేక సపోర్ట్ లేకుండా పిల్లల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయుల ను అభినందించారు. పిల్లలలోని లోపాలతో పాటు వారి ప్రతిభను, ఆసక్తులు, నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహిస్తే వారు సమాజంలో సమానంగా ఎదగగలరని చెప్పారు. చదవడం, రాయడం వంటి ప్రాథమిక విద్య నేర్పడం ద్వారా వారు స్వయం సమర్థత సాధించేందుకు సహాయపడతుందని చెప్పారు. పిల్లల భవిష్యత్తు విషయంలో తల్లిదండ్రులు ఆందోళన చెందకుండా ధైర్యంగా ఉండాలని సూచిస్తూ, ప్రభుత్వం తరఫున అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల కోసం ప్రభుత్వం భవిత కేంద్రం ద్వారా పలు సేవలు, పథకాలు అమలు చేస్తోందని కలెక్టర్ తెలిపారు. విజ్ఞాన్ ప్రత్యేక పాఠశాలకు రెంట్ పద్ధతిలో స్థలం కేటాయింపు, ఆర్థిక సహాయం వంటి విషయాలపై అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పిల్లల ఆరోగ్య సదుపాయాల పరంగా రిమ్స్‌లో అన్ని వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఇటీవల ప్రత్యేకంగా చిన్నారుల కోసం ఉచిత గుండె వ్యాధి వైద్య శిబిరం నిర్వహించామని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, జిల్లా మిషన్ కోఆర్డినేటర్ యశోద, సైకాలజిస్టు శ్రీహరి, విద్యా కౌన్సిలర్ మహిపాల్, ఉపాధ్యాయురాలు స్వప్న, విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వందేమాతరం గీతం ఆలాపన బిజెపి మెట్ పల్లి పట్టణ శాఖ ఆధ్వర్యంలో స్కూల్లో నిర్వహించడం జరిగింది.





మెట్ పల్లి అమృత్ తెలంగాణ నవంబర్ 22: వందేమాతరం నినాదం భారత స్వతంత్ర పోరాటంలో దీని పాత్ర అమోఘం వందేమాతరం మూల చరిత్ర బెంగాలీ రచయిత బంకిచన్ చటర్జీ రచన ఈ గీతాన్ని ఆయన 1875లో రచించారు.ఇది మొట్టమొదటైన సంపందకత్వంలో నడిపించిన బంగ్ల దర్శనాన్ని పత్రిక పాచించబడింది వందేమాతరం అంటే తల్లి నీకు వందనం అని అక్షరాల అర్థం ఇందులో భారతదేశాన్ని తల్లిగా భారతమాతగా కీర్తించడం జరుగుతుంది.జాతీయ గీతం హెూదా స్వాతంత్రం వచ్చిన తర్వాత జనవరి 24 1950న భారత రాజ్యాంగ సభ ఈ గీతాన్ని జాతీయ పాటగా స్వీకరించింది జనగణమన కు ఉన్నట్లే దీనికి కూడా సమానమైన హెూదా గౌరవం ఉండాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించడం జరిగింది,

ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షుడు బోడ్ల రమేష్, జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు,రాష్ట్ర నాయకులు డాక్టర్ రఘు, జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి శ్రీనివాస్, పార్లమెంట్ కో కన్వీనర్ గుంటుక సదాశివ్, బిజెపి జిల్లా కార్యదర్శి పీసు రాజేందర్ రెడ్డి,పట్టణ ప్రధాన కార్యదర్శులు సుంకేటి విజయ్,పన్నాల రాఘవరెడ్డి,నాయకులు భోగ దత్తు,తదితరులు పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్‌కు చెందిన ఐఆర్ఎస్, ఐఏఎస్, ఐఆర్ఎంఎస్, ఐపీఓఎస్, ఐడిఏఎస్, ఐఈఎస్ అధికారులు జిల్లాలో పర్యటనకు వచ్చిన సందర్భంగా శనివారం కలెక్టరేట్ సమావేశం





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్‌కు చెందిన ఐఆర్ఎస్, ఐఏఎస్, ఐఆర్ఎంఎస్, ఐపీఓఎస్, ఐడిఏఎస్, ఐఈఎస్ అధికారులు జిల్లాలో పర్యటనకు వచ్చిన సందర్భంగా శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పర్యటనకు వచ్చిన 14 మంది శిక్షణ అధికారులకు స్వాగతం పలికి వారిని పరిచయం చేశారు. బేల మండలంలోని అవళ్‌పూర్ గ్రామం, తలమడుగు మండలంలోని దేవాపూర్, సోనాల మండల కేంద్రంలో మూడు బృందాలుగా విభజించి పర్యటన నిర్వహించనున్నట్లు తెలిపారు. అదనంగా ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఒక వార్డులో కూడా క్షేత్ర స్థాయి పరిశీలన చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ మౌలిక సదుపాయాలు, ఆరోగ్యం, విద్య, పారిశుధ్యం, వ్యవసాయం, జీవనోపాధి తదితర అంశాలపై శిక్షణ అధికారులు అధ్యయనం చేయనున్నట్లు తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా గురించి వివరిస్తూ, జిల్లాలో వివిధ మతాలు, కులాల ప్రజలు సామరస్యంగా నివసిస్తున్నారని అన్నారు. అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అధ్యయనం చేసి, త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో వాటి నిర్వహణపై పరిశీలన చేయవచ్చని సూచించారు. క్షేత్ర పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, పర్యటన ముగింపులో తాము చేసిన అధ్యయన ఫలితాలపై సూచనలు ఇవ్వాలని శిక్షణ అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డీఆర్డీఓ రవీందర్, డీపీఓ శ్రీధర్, డీఎంహెచ్ఓ నరేందర్, పరిశ్రమల శాఖ జీఎం పద్మభూషణ్ రాజ్, రీజనల్ ట్రైనింగ్ మేనేజర్ ప్రభాకర్ స్వామి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లకు డబ్బులు అడిగితే రోకలి బండతో కొట్టండి. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్



ప్రొసీడింగ్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్

మెట్ పల్లి:(కోరుట్ల) అమృత్ తెలంగాణ నవంబర్ 22:ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారుల నుండి కొందరు డబ్బులు వసూలు చేస్తున్నట్లు తన దృష్టి కి వచ్చిందని, ఎవరైనా డబ్బులు అడుగుతే నిలదీయాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ సూచించారు. శనివారం మెట్ పల్లి లోని ఎంపీడీఓ కార్యాలయంలో మెట్ పల్లి పట్టణ, మెట్ పల్లి మండలానికి చెందిన 63 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే కోటాలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ ను ఎమ్మెల్యే సంజయ్ లబ్ధిదారులకు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లకు డబ్బులు వసూలు చేస్తున్నారని వరుస ఫిర్యాదులు వస్తున్నాయని, నాయకులైన, అధికారులైన, సిబ్బందైన వారు ఎవరైనా కూడా డబ్బులు అడిగితే రోకలి బండతో కొట్టండన్నారు. నేనే జైలుకు వేలుతానని ఎమ్మెల్యే అన్నారు.డబ్బులు అడిగితే నేరుగా కాల్ చేయాలని సంజయ్ సూచించారు. నిరుపేదల సొంతింటి కల సహకారం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇలాంటి పథకాల్లో దళారులు డబ్బులు అడగడం ఆందోళన కలిగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, ఇందిరమ్మ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ సరఫరా వేగవంతం చేయండి. జిల్లా కలెక్టర్ రాజర్షి షా.




సమావేశంలో మాట్లాడుతున్న ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజార్షి షా



హాజరైన అధికారులు

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి: జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (CMR) సరఫరాను వేగవంతం చేయాలని కలెక్టర్ రాజార్షి షా మిల్లర్లను ఆదేశించారు శనివారం కలెక్టర్ ఛాంబర్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఇప్పటికే ప్రభుత్వం విధించిన గడువులు ముగుస్తున్న నేపథ్యంలో మిల్లర్లు సన్నబియ్యం మిల్లింగ్, సి.ఎం.ఆర్ సరఫరా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సమయానికి సి.ఎం.ఆర్ సరఫరా చేయని మిల్లర్లపై చర్యలు తప్పవని హెచ్చరించిన కలెక్టర్, డిసెంబర్ నెలాఖరు లోపు వందశాతం సి.ఎం.ఆర్ సరఫరా పూర్తి చేయాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రతి వారం సరఫరా పురోగతిపై యాక్షన్ ప్లాన్ రూపొందించి నివేదికలు సమర్పించాలని మిల్లర్లకు ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా, సన్నబియ్యం పూర్తిగా మిల్లింగ్ చేసి సమయానికి సివిల్ సప్లై గోదాములకు అందజేసేలా తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా పౌర సరఫరాల అధికారులకు సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, నిర్లక్ష్యం సహించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామల దేవి, జిల్లా పౌర సరఫరాల అధికారి నందిని, సంస్థ జిల్లా మేనేజర్ సుధారాణి, అధికారులు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

## అంతర్రాష్ట్ర సైబర్ నిందితుడినీ అరెస్ట్ చేసిన జగిత్యాల పోలీసులు




జగిత్యాల అమృత్ తెలంగాణ నవంబర్ 22: వివిధ రాష్ట్రాల్లో సైబర్ నేరాలకు పాల్పడ్డ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం కాకినాడకు చెందిన డానియల్ కెవిన్ ఎడ్విన్ ను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్టు డిఎస్పి రఘు చందర్ తెలిపారు. శనివారం జగిత్యాల రూరల్ సిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సారంగాపూర్ మండలం పెంబట్లకు చెందిన అనుమండ్ల నవీన్ కు నిందితుడు దుబాయిలో ఉద్యోగం ఇప్పిస్తానని వీసా కోసం రూ 8, 40, 000 వసూలు చేశాడు.

## ఫిల్టర్ బెడ్ పరిశీలించిన అదనపు కలెక్టర్: రాజా గౌడ్

కోరుట్ల అమృత్ తెలంగాణ నవంబర్ 22: జిల్లాలోని కోరుట్ల మండల కేంద్రంలోని తాళ్లచెరువు ఫిల్టర్ బెడ్ ను అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ శనివారం పరిశీలించారు. పట్టణ ప్రజలకు సకాలంలో నీరు అందించాలని, ఫిల్టర్ బెడ్ ను, నీటి స్వచ్ఛతను ఎప్పటికప్పుడు పరిశీలించాలని మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రవీందర్, సంబంధిత అధికారులు ఆయన వెంట ఉన్నారు.




## శాస్త్రీయ పద్ధతిలో తేనే తీగల పెంపకం ఉత్తమం

కాటారం : కాటారం ఏఎంసీ చైర్ పర్సన్ పంతకాని తీర్మాల సమ్మయ్య వారి ఆధ్వర్యంలో తేనే తీగల పెంపకం శిక్షణ తరగతులలో భాగంగా శనివారం రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ.. రైతులు వ్యవసాయం తో పాటు అదనపు ఆదాయ మార్గాలను ఎంచుకోవాలని అందులో భాగంగా తేనే తీగల పెంపకం అనేది చాలా ఉత్తమము అని అన్నారు. అలాగే శాస్త్రీయ పద్ధతిలో పెంపకం ద్వారా స్థిరమైన ఆదాయ వనరుగా ఉంటుంది. అని రైతులకు సూచించారు.

# బాధిత కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటాం – జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**అనారోగ్యంతో మరణించిన హెడ్ కానిస్టేబుల్ కుటుంబ సభ్యులకు రూ లక్ష చెక్కు అందజేత.**
**బాధిత కుటుంబ సభ్యుల సంక్షేమం కోసం పోలీసు వ్యవస్థ ముందుంటుంది**
**ప్రభుత్వం ద్వారా వచ్చే లబ్ధి త్వరగా వచ్చేలా చర్యలకు ఆదేశాలు.**
**జూన్ లో అనారోగ్యంతో మరణించిన ఇచ్చోడా హెడ్ కానిస్టేబుల్ ఎం నాగేశ్వరరావు.**




అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి బాధిత కుటుంబ సభ్యులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ పోలీసు సహాయ సహకారాలు అందిస్తామని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ హామీ ఇచ్చారు. శనివారం స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయం నందు, జూన్ మాసం నందు ఇచ్చోడా పోలీస్ స్టేషన్ నందు విధులు నిర్వర్తిస్తున్న హెడ్ కానిస్టేబుల్ ఎం నాగేశ్వరరావు అనారోగ్యంతో పరమపదించడం జరిగింది. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులైన భార్య ఎం అనసూయ, కుమారుడు ఎం చందు లను పోలీసు ముఖ్య కార్యాలయానికి ఆహ్వానించి, వారి బాగోగులను అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వం ద్వారా కార్పస్ ఫండ్ లో వచ్చిన లక్ష రూపాయల చెక్కును కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది. ఎలాంటి సందర్భంలోనైనా జిల్లా పోలీసు యంత్రాంగం అందుబాటులో ఉంటే సహాయ సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు. మిగిలిన ప్రభుత్వ ద్వారా వచ్చే లబ్ధి త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. వచ్చిన డబ్బును అక్రమశిక్షణతో వాడుకోవాలని సూచిస్తూ ఎలాంటి పరిస్థితుల్లో నైనా పోలీసు సహాయాన్ని సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి బి సురేందర్ రావు, పోలీసు కార్యాలయం సూపర్డెంట్ సులోచన, సిబ్బంది దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా జల్ సంచార్ లో ఉత్తమ ఫలితాలు సాధించినందుకు అవార్డు

**సన్మానించిన తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి**



అదిలాబాద్ జిల్లా కలెక్టర్ ను సన్మానిస్తున్న దృశ్యం

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ అందుకున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా ని కలెక్టర్ ఛాంబర్ లో కలిసి సన్మానించిన టిపిసిసి ఉపాధ్యక్షురాలు, ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆత్రం సుగుణక్క తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి , కాంగ్రెస్ శ్రేణులు. ఈ సందర్భంగా కలెక్టర్ ని శాలువాతో సన్మానించి అభినందనలు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో మావల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ సునీల్, జాదవ్ ,సంతోష్ కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు తడిసిన వెంకట్ రెడ్డి, మావల మండల్ మాజీ ఎంపీపీ అట్ల గోవర్ధన్ రెడ్డి, మాజీ కో ఆప్షన్ మెంబర్ మాజీ CO –ఆప్షన్ మెంబర్ రహీమ్ ఖాన్, NSUI మండల అధ్యక్షుడు గౌతం , sk అలీమ్, కుదురుపాక సురేష్,వసీం, దత్తు, సమీ ఉల్లా ఖాన్, అప్సర్ ఖాన్ , ఫహీమ్ ఖాన్, అప్సర్ ఖాన్, రహిమాన్ ఖాన్, ఫెరోజ్ ఖాన్,తదితరులు పాల్గొన్నారు

# కళలతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలి




వనపర్తి :అమృత్ తెలంగాణ: జిల్లాలోని యువత తమలో దాగి ఉన్న కళను ప్రదర్శించి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేందుకు జిల్లా స్థాయి యువజనోత్సవాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో స్థానిక బాలుర పాఠశాల మైదానంలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవాలకు కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జనవరి, 12న జరిగే స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని గ్రామీణ ప్రాంతాల్లోని యువత కళను వెలికి తీసి ఉత్తమంగా రాణించిన కళాకారులను రాష్ట్ర, జాతీయ స్థాయిలో పంపించేందుకు నిర్వహిస్తున్న యువజనోత్సవ కార్యక్రమంలో ఫోక్ డ్యాన్స్, చిత్ర లేఖనం, పాటలు, వక్తృవ, ఉపన్యాస పోటీలు తదితర 7 రంగాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువత ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని అలుపెరగకుండా సాధన వైపు దూసుకెళ్లాలని సూచించారు. జిల్లాలోని యువత తమ అత్యుత్తమ కళా ప్రదర్శన ద్వారా డిసెంబర్ లో జరిగే రాష్ట్ర స్థాయి, జనవరి 12న జరిగే జాతీయ స్థాయి యువజనోత్సవ వేడుకల్లో రాణించి వనపర్తి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. స్థానికంగా ఉన్న ఇండోర్ స్టేడియాన్ని యువత సద్వినియోగం చేసుకొని, శారీరక దృఢత్వంతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. జిల్లా యువజన సర్వీసులు, క్రీడల అధికారి సుధీర్ రెడ్డి యువజనోత్సవాల ప్రాధాన్యతను యువతకు వివరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా అధికారి అబ్దుల్ ఘని, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి అంజయ్య, డిప్యూటీ కలెక్టర్ శ్రావ్య, తహసిల్దార్ రమేష్ రెడ్డి, ప్రిన్సిపాల్ ఆనంద్, పి.డి సురేందర్ రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# గుండెపోటుతో ఏఎస్ఐ మృతి



అచ్చంపేట : అమృత్ తెలంగాణ: ఇంటలిజెన్స్ విభాగంలో ఏ ఎస్ఐ గా విధులు నిర్వహిస్తున్న మహేష్ బాబు శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మరణించారు. విధుల పట్ల అంకితభావంతో పనిచేసేవారని ప్రతిరోజు క్రీడల పట్ల ఆసక్తి చూపేవారు. అందరితో ఆప్యాయత పలకరించే వ్యక్తి మహేష్ గుండెపోటుతో మరణించడం పలువురిని కంటనీరు పెట్టించింది. పోలీస్ సిబ్బంది, క్రీడాకారులు శ్రేయోభిలాషులు మహేష్ మృతదేహానికి నివాళులర్పించారు. అమ్రాబాద్ మండలం దోమలపెంట సొంత గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

# అదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ డిసిసి అధ్యక్షుడిగా నరేష్ జాదవ్



అదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన డిసిసి అధ్యక్షులు నరేష్ జాదవ్

అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ అదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ డిసిసి అధ్యక్షుడిగా నరేష్ జాదవ్ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ప్రకటించిన అదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా మాజీ మంత్రి వర్యులు స్వర్గీయ చిలుకూరి రామచంద్రా రెడ్డి శిష్యులు గిరిజన నాయకులైన ఆదివాసి ముద్దుబిడ్డ నరేష్ జాదవ్ ని ఎన్నుకోవడం అదిలాబాద్ జిల్లాకాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఆనందాన్ని వ్యక్తపరుస్తూ సంతోష సంబరాలలో మునిగితేలారు గిరిజన జిల్లా మారుమూల ప్రాంతమైన ఆదిలాబాద్ నకు చెందిన గిరిజనుల్లో పట్టభద్రుడైన చురుకైన వ్యక్తి అజాతశత్రువుగా పేరెన్నిక పొందిన ఆదివాసి నాయకునిగా ప్రజాధరణ పొందిన ఏఐసీసీ నాయకునిగా అన్నిట్లో రాణిస్తూ జిల్లాలోనే తన ప్రత్యేక శైలిని కనబరుస్తూ డిసిసి అధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా పార్టీని పటిష్టం చేసే విధంగా సీనియర్ నాయకులు కలుపుకొని పోతారని ఆయనకు అనుభవం ఉన్నదని పలువురు సీనియర్ నాయకులు తెలిపారు

# సామాజికసేవలో లయన్స్ క్లబ్ ది ప్రత్యేక పాత్ర




చారకొండ :అమృత్ తెలంగాణ: సామాజిక సేవలో లైన్స్ క్లబ్ ది ప్రత్యేక పాత్ర అని లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ జూలూరు రమేష్ బాబు, తహసిల్దార్ ఉమా, ఎస్సై వీరబాబులు అన్నారు. శనివారం చారకొండ మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ కల్వకుర్తి, లైన్స్ క్లబ్ ఆమనగల్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత డయాబెటిక్ శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా లయన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను అభినందించడంతోపాటు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. శిబిరంలో 265మందికి ఉచితంగా డయాబెటిక్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కల్వకుర్తి అధ్యక్షుడు చిగుళ్ల పల్లి శ్రీధర్, జోన్ చైర్మ న్ జూలూరి లింగయ్య, చార్టర్ ప్రెసిడెంట్ కల్మచర్ల రమేష్, ప్రచార కార్యదర్శి గణేష్, మేకల శ్రీనివాస్, గందె రవి, క్యాంపు చైర్మన్ వాడకట్టు సంపత్ కుమార్. నిర్వాహకులు శ్యాంసుందర్, రాముని రామనాథం మాజీ జెడ్పిటిసి వెంకట్ గౌడ్, మాజీ ఎంపిటిసి బలరాం, గజ్జె యాదయ్య, మండల ఆర్య సంఘ అధ్యక్షుడు రాచమల్ల చంద్రశేఖర్, లక్ష్మణ్, జెసిబి వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులను ఘనంగా సత్కరించారు.

# యూరియా తగిన మోతాదులో వాడాలి




ముధోల్ :అమృత్ తెలంగాణ: రైతులు యూరియా తగిన మోతాదులో వాడాలని జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్ అన్నారు. మండలంలోని కారే గాం గ్రామంలోని రైతు వేదికలోశనివారం స్పిక్ , గ్రీన్‌స్టార్ ఆధ్వర్యంలో రైతుల కోసం ఏర్పాటు చేసినశిక్షణ సదస్సులో పాల్గొని మాట్లాడారు. యూరియాను తగిన మోతాదులో మాత్రమే వాడాలని సూచించారు .అధికంగా వాడితే నేల సారాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అందుకే నానో యూరియా వినియోగాన్ని ప్రోత్సహించాలని అన్నారు. అలాగే రైతులు పంట మార్పిడి తప్పకుండా పాటించి నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు.పంటల సంరక్షణ, ఎరువుల వినియోగం, ఆధునిక సాగు పద్ధతులపై అధికారులు రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రచన, హరికృష్ణ, ఎఇఓ ప్రవీణ్ ,స్పిక్ రీజినల్ మేనేజర్ శివ, పిఎసిఎస్ సిఈఓ సాయి రెడ్డి, మ్యాక్స్ చైర్మన్ నర్సారెడ్డి ,తదితరులు పాల్గొన్నారు.

# అదనపు ఎస్పీ అడ్మిన్ గా బాధ్యతలను స్వీకరించిన పి మౌనిక



బాధ్యతలు స్వీకరిస్తున్న దృశ్యం

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ బదిలీలలో భాగంగా నల్గొండ జిల్లా దేవరకొండ ఏసీపీగా విధులు నిర్వహించి ఆదిలాబాద్ అదనపు ఎస్పీ పరిపాలన గా బదిలీ అయిన పి మౌనిక పోలీసు ముఖ్య కార్యాలయం నందు అదనపు ఎస్పీ అడ్మిన్ గా బాధ్యతలను స్వీకరించడం జరిగింది. పరిపాలన విధులు మరింత చురుకుగా మరియు సులువుగా జరిగేలా చర్యలు చేపడతామని తెలియజేశారు.

# అదిలాబాద్ జిల్లా కలెక్టర్ సన్మానించిన మాజీ తాజా కౌన్సిలర్ బండారి సతీష్



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ పలుమార్లు జాతీయ అవార్డులు అందుకుంటున్న జిల్లా కలెక్టర్ అదిలాబాద్ కాంగ్రెస్ జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ బండారి సతీష్ , సంద నర్సింగ్, చిన్నయ్య ,ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. తమరు మరిన్ని పథకాలు సాధించాలని కోరడం జరిగింది. అదిలాబాద్ జిల్లాకు వన్నె తెచ్చి అదిలాబాద్ పేరు రాష్ట్రంలోనే , దేశంలోనే మారుమోగే విధంగా చేసిన జిల్లా కలెక్టర్ కి అదిలాబాద్ పట్టణ ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది.

# మహిళా ఆర్థిక స్వావలంబనే కాంగ్రెస్ లక్ష్యం



వనపర్తి:అమృత్ తెలంగాణ: కాంగ్రెస్ ప్రభుత్వం తోనే మహిళలకు ఆర్థిక స్వావలంబన చేకూరుతుందని, మహిళా ఆర్థిక స్వావలంబనను దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలలో మహిళలను భాగస్వామ్యం చేస్తుందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. శనివారం పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లి జంగమయ్యపల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మహిళలకు చీరలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పనులు చేపట్టిందన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత కరెంటు, ఇందిరమ్మ ఇండ్లు రేషన్ కార్డులు, ఆదర్శ పాఠశాలలో మహిళా అధ్యక్షురాలు, పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులు కుట్టడం, ఆర్టిసి బస్సుల కొనుగోలులో మహిళా సమాఖ్యల భాగస్వామ్యం, వడ్డీ లేని రుణాలు, విద్యార్థులకు వసతి మెస్ చార్జీల పెంపు లాంటి అనేక పథకాలను మహిళలకు ఉపయోగపడే విధంగా అనునిత్యం మహిళా అభ్యున్నతి కోసం ప్రభుత్వం పాటుపడి ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

కోటిమంది మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఈ క్రమంలోనే ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకొని రాష్ట్రం లోని కోటి మంది మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టిందన్నారు. సొంత కూతురికి, సొంత చెల్లెలికి విలువ ఇవ్వకుండా మాట్లాడే బి ఆర్ ఎస్ నాయకులు నేడు నీతులు వల్లించడం విడ్డూరమన్నారు. పదేళ్ల కాలంలో మహిళలను పట్టించుకోని పట్టించుకోని నాయకులు నేడు గ్రామాల్లో తిరుగుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పై అబద్ధాలు ప్రచారం చేయడం హాస్యాస్పదమన్నారు.

రానున్న స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచే అభ్యర్థులను గెలిపించి తనకు బలంగా నిలవాలని ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలిస్తే అభివృద్ధి సులభం అవుతుందని ఎమ్మెల్యే అన్నారు. ఇతర పార్టీల అభ్యర్థులను గెలిపిస్తే వారు అభివృద్ధికి ఆటంకాలుగా మిగులుతారని ఏ ఒక్కరికి అవకాశం ఇవ్వకూడదని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షులు రామకృష్ణారెడ్డి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు స్వరూప, మాజీ జడ్పిటిసి లు వెంకటస్వామి, రమేష్ గౌడ్, వేణుగోపాల్, నాయకులు మణిగిల్ల తిరుపతి రెడ్డి, శ్రీశైలం యాదవ్, మహిళా సమాఖ్య సభ్యురాలు అధికారులు దళితులు పాల్గొన్నారు.

# అస్మిత అథ్లెటిక్ లీగ్ లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

సారంగాపూర్ :అమృత్ తెలంగాణ: జిల్లా స్థాయి అస్మిత అథ్లెటిక్ పోటీల్లో జామ్ సాంఘిక సంక్షేమబాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి వివిధ విభాగాలలో బహుమతులు గెలుపొందారు. దీనిలో భాగంగా రిషిక జావలిన్ త్రో లో గోల్డ్ మెడల్, రక్షిత జావలిన్ త్రో లో సిల్వర్ మెడల్, డిస్క్ త్రో లో సిల్వర్ మెడల్, అనుష్క 600 మీటర్స్ రన్నింగ్ లో కాంస్య పతకాన్ని సాధించారు, అలాగే జగశ్రీ బాస్కెట్బాల్ లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎన్నికయ్యారు. వివిధ విగల్లో పథకాలు సాధించిన విద్యార్థినులను,పిఈటి సుస్మిత,పిడి సుప్రియ లను, కళాశాల ప్రిన్సిపాల్ బి. సంగీత అభినందించారు.

# తాగి కొడుతున్నారంటూ మహిళా సంఘాల నిరసన

అక్కన్నపేట :అమృత్ తెలంగాణ: అక్కన్నపేట మండలం ధర్మారం గ్రామంలో మహిళలంతా ఏకమై బెల్ట్ షాపుల ముందు ధర్నా నిర్వహించారు. ఊళ్లో బెల్ట్ షాపుల వల్ల మగవాళ్లంతా తాగుబోతులుగా తయారవుతున్నారని, ఇంటికి వచ్చి ఇష్టం వచ్చినట్టు కొడుతున్నారని ఆరోపించారు. ఎన్నిసార్లు చెప్పినా వారి ప్రవర్తనలో మార్పు రాలేదని సూచించారు. బెల్ట్ షాపు యజమానులు ఉద్దెర ఇవ్వడం వల్ల, మాకు వచ్చిన కూలి పంట డబ్బులు కూడా అటే వెళ్ళిపోతున్నాయని తెలియజేశారు. ఈ ఇష్యుపై ఎక్స్చేంజ్ అధికారులకు విన్నవిస్తే, కనీసం పట్టించుకోలేదని అన్నారు. మీరు చక్కగా ఉంటే మీ భర్తలు చక్కగా ఉంటారంటూ కించపరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. మేము రోజు కూలి చేసి మా పిల్లల్ని సాకుతున్నామని, భూములు అమ్ముకునే పరిస్థితి కూడా వస్తున్నాయని కన్నీటి పర్యంతమయ్యారు. గ్రామంలో బెల్ట్ షాపులను పూర్తిగా తొలగించాలని గ్రామపంచాయతీ కార్యదర్శి వినతి పత్రం అందించారు. దీనిపై ఎక్సైజ్ అధికారులు స్పందించి బెల్ట్ షాపులను తొలగించకపోతే గ్రామమంతా కదిలి, హుస్నాబాద్ ఎక్సైజ్ ఆఫీస్ ముందు ధర్నా కార్యక్రమం



నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ధర్మారం గ్రామం మహిళలు, పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి




కుభీర్ :అమృత్ తెలంగాణ: ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు నాణ్యతతో కూడిన భోజన్ని అందించేలని జిల్లా విద్యాధికారి దర్శనం భోజన్న అన్నారు. శనివారం మండల కేంద్రమైన కుభీర్ లోని కస్తూరిబా గాంధీ, ప్రాథమిక పాఠశాలతో పాటు ఉన్నాత పాఠశాలను అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న పలు రికార్డులను పరిశీలించి పలు సూచనలు సలహాలు అందించారు. అదే విదంగా విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన శాలను పరిశీలించి ఎప్పటికప్పుడు వంట శాలను శుభ్రంగా ఉంచుకునేలా చూడలని అన్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థుల తరగతి గదిలోకి వెళ్లి వార్షిక పరీక్షలకు సన్నద్ధం కావాలని తెలిపారు. ముఖ్యంగా పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు తీసుకువచ్చి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు పేరు తీసుకురవాలని సూచించారు. అక్కడి నుంచి ఉన్నాత పాఠశాలలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల కంప్లెక్స్ సమావేశంలో హాజరై పలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమం లో మండల

విద్యాధికారి విజయ్ కుమార్ సెక్టోరియల్ అధికారి ప్రవీణ్ కుమార్ కంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సురేష్, గంగాధర్, కస్తూరిబా గాంధీ ఎస్ ఓ వాణి శ్రీ ఏ ఈ మహేష్, దత్తాత్రి ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు సి ఆర్ పి లు గంగాధర్ ఆనంద్, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

# సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు ముందుకు రావాలి

హుస్నాబాద్ రూరల్ :అమృత్ తెలంగాణ: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని , సీసీ కెమెరాలు ఏర్పాటుకు ప్రజలు ముందుకు రావాలని హుస్నాబాద్ ఎస్ఐ లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం హుస్నాబాద్ మండలంలోని గ్రామంలో సీసీ కెమెరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నేరాల అదుపునకు ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమని తెలిపారు. కూచనపల్లి గ్రామంలో 7 సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామస్థులు స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానంగా పనిచేస్తుందని వివరించారు. దొంగతనాలు జరిగినప్పుడు సీసీ కెమెరాలు ఉంటే, నిందితులను గుర్తించి కేసు ఛేదించడానికి చాలా తక్కువ సమయంలో సాధ్యమవుతుందని చెప్పారు. ప్రతి గ్రామంలోనూ నేరాలు




లేని వాతావరణం కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడానికి ప్రజలు చొరవ తీసుకోవాలన కోరారు.

# అనారోగ్య బాధితులకు ఆర్థికసాయం అందించిన పాండన్న



పెద్దవూర :అమృత్ తెలంగాణ: తిరుమలగిరి సాగర్ మండలం బట్టు వెంకన్నబావి తండా గ్రామంలోని మాజీ సర్పంచ్ జటావత్ దేవు నాయక్ సూచన మేరకు వారి ఆధ్వర్యంలో తాండకు జటావత్ గాసి నాయక్, జటావత్ బుజ్జి,మెగావత్ హారోజన్ నాయక్, నలావత్ మల్లేశ్వరి, ఆంగోతు హనిమి కుటుంబాలకు చెందిన వారు వివిధ కారణాల వల్ల అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న బుసిరెడ్డి పాండురంగారెడ్డి వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. అదేవిధంగా ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో నెల్లికల్ తాజా మాజీ సర్పంచ్ పమ్మి జనార్ధన్ రెడ్డి, అనుముల మండలం మాజీ వైస్ యంపిపి తిరుమలనాథ గుడి మాజీ ఛైర్మన్ బుర్రి రామిరెడ్డి, జటావత్ పాండు నాయక్, హనుమ నాయక్, సూర నాయక్, గజ్జల శివారెడ్డి, గజ్జల నాగార్జున రెడ్డి, ఇస్రం లింగస్వామి, షేక్ అబ్దుల్ కరీం మరియు బట్టు వెంకన్నబావి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ చీరలు పంపిణీ చేసిన మంత్రి సీతక్క

గోవిందరావుపేట :అమృత్ తెలంగాణ: మండల కేంద్రంలోని రైతు వేదికలో రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క శనివారం కనకదుర్గ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని చీరలు పంపిణీ చేశారు. మండలంలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజి ద్వారా 283 సంఘాలకు ఇరువై తొమ్మిది కోట్ల ఎనబై ఆరు లక్షల యాబై వేల రూపాయల ఋణాల పంపిణీ చెక్కను మంత్రి సీతక్క అందచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఆత్మ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డి, డి ఆర్ డి ఓ శ్రీనివాస్ రావు, ప్రజా ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ఎమీ జాక్సన్ కొత్త డేటింగ్ పై ఆగని రూమర్లు



అందాల ఎమీ జాక్సన్ బ్రిటన్ కి చెందిన బిలియనీర్ జార్జి పనాయటౌని పెళ్లాడి ఒక బిడ్డకు జన్మనిచ్చిన సంగతి తెలిసిందే. కానీ ఇటీవల ఈ జంటకు బ్రేకప్ అయ్యిందన్న గుసగుసా వినిపిస్తోంది. అంతేకాదు గాసిప్ గర్ల్ స్టార్ ఎడ్ వెస్ట్ విక్ తో ఎమీజాక్సన్ గత కొంతకాలంగా డేటింగ్ చేస్తోందని కథనాలొస్తున్నాయి. ఇటీవలే వెస్ట్ విక్ పుట్టినరోజు వేళ ఇద్దరూ అతని కుటుంబంతో కలిసి సెలబ్రేట్ చేసుకోవడం ఇప్పుడు మరోసారి హాట్ టాపిక్ గా మారింది. ఎడ్ విక్ 35వ పుట్టినరోజు వేడుకల్లో ఎమీజాక్సన్ అతడికి ఎంతో సన్నిహితంగా కనిపించింది. ఈ వీడియోలో ఎడ్ తన పుట్టినరోజు కేక్ ను కట్ చేస్తున్నప్పుడు అమీ అతనితో పాటు నిలబడి కనిపించింది. తన ప్రియమైన వారితో కలిసి వేడుకలో ఎడ్ విక్ నవ్వులు చిందిస్తూ కనిపించాడు. ఎడ్ విక్ తన బర్త్ డే కేక్ కట్ చేసి కొవ్వొత్తులను ఊదుతూ ఈ వీడియోలో కనిపించాడు. ఎడ్– ఎమీజాక్సన్ జంట ఇటీవల రాయల్ అస్కాట్– 2022కి హాజరయ్యారు. ఈ సంవత్సరం ప్రారంభంలో స్పెయిన్ లో విహారయాత్రలో కూడా కనిపించారు. గత డిసెంబర్ లో సౌదీ అరేబియాలోని రెడ్ సీ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ లో మొదటిసారిగా ఒకరినొకరు కలుసుకున్నారు. తక్షణమే ప్రేమలో పడ్డారు. ప్రస్తుతం ఆ ఇద్దరి అనుబంధంపైనా మీడియాలో రకరకాల కథనాలు వస్తున్నాయి. అయితే దీనిపై అధికారికంగా ఆ ఇద్దరి నుంచి ఎలాంటి ప్రకటనలు రాలేదు. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. ఎమీ జాక్సన్ చివరిగా 2.0 చిత్రంలో కనిపించింది. ఇందులో రజనీకాంత్ – అక్షయ్ కుమార్ కీలక పాత్రల్లో నటించారు. ఎమీ ప్రస్తుతం యునైటెడ్ కింగ్ డమ్ లో నివాసం ఉంటోంది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో .. తన కొడుకు ఆండ్రియాస్ కొంచెం పెద్దయ్యాక తిరిగి సినిమాల్లోకి రావాలనుకుంటున్నానని .. భారతదేశంలో షూటింగ్ లను మిస్సవుతున్నానని కూడా పేర్కొంది.

# నిలువెత్తు అందగత్తె అదరహో


తెలుగు ప్రేక్షకులకు ఎస్ ఎం ఎస్ సినిమా తో పరిచయం అయిన ముద్దుగుమ్మ రెజీనా. ఈ అమ్మడు తక్కువ సమయంలోనే బ్యాక్ టు బ్యాక్ చిన్నా మీడియం రేంజ్ సినిమాల్లో నటించి మంచి గుర్తింపు ను దక్కించుకుంది. హీరోయిన్ గా తెలుగు తో పాటు ఇతర భాషల్లో కూడా నటిస్తూ దాదాపు పుష్కర కాలంగా ఇండస్ట్రీలో కొనసాగుతున్న రెజీనా ఇప్పటికి కూడా పలు సినిమాల్లో నటిస్తూ ఉంది. ప్రస్తుతం ఈ అమ్మడు నటిస్తున్న పలు సినిమాలు చర్చల దశలో.. కొన్ని షూటింగ్ దశలో ఉన్నాయి. హీరోయిన్ గానే కాకుండా స్పెషల్ సాంగ్ లో కనిపించడం.. ప్రత్యేక పాత్రల్లో కనిపిస్తూ బిజీ బిజీగా ఉన్న ఈ అమ్మడు సోషల్ మీడియాలో ఫోటో షూట్స్ తో కూడా తగ్గేదే లే అన్నట్లుగా అందాల ఆరబోత చేస్తూ కుర్రకారుకు చెమటలు పట్టిస్తోంది. తాజాగా రెజీనా షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. పెద్ద ఎత్తున అందాల ఆరబోత చేయకున్నా కూడా నిలువెత్తు అందం అనిపించేలా బాటమ్ యాంగిల్ ద్వారా ఈ అమ్మడి అందాల ఆరబోతకు ప్రతి ఒక్కరు ఫిదా అవుతున్నారు. థైస్ ను ఎక్స్ పోజ్ చేస్తూ కొంటగా చూస్తున్న రెజీనా అందం ను చూసి ప్రతి ఒక్కరు కూడా అదరహో అనకుండా ఉండలేరు అన్నట్లుగా కామెంట్స్ వస్తున్నాయి. ఇటీవలే మెగాస్టార్ సినిమా లో ఐటెం సాంగ్ చేసిన ఈ అమ్మడు మరిన్ని ఐటెం సాంగ్స్ ను చేసేందుకు సిద్ధం అన్నట్లుగా ఉంది. ఆకట్టుకునే అందంతో పాటు మంచి ఫిజిక్ తో అలరించే ముద్దుగుమ్మ రెజీనా స్టార్ హీరోలకు జోడీగా హీరోయిన్ గా నటించే అవకాశాలు మాత్రం ఇప్పటి



వరకు దక్కించుకోలేక పోయింది. ఆ ఆఫర్లు రాకపోవడంతో స్టార్ హీరోయిన్ గా మాత్రం ఈ అమ్మడు గుర్తింపు దక్కించుకోలేక పోయింది.

# వింత వ్యాధి గురించి బయటపెట్టిన హీరోయిన్

సినిమా రంగంలో నటీనటులు పైకి ఎంత స్టార్స్ హోదా తో కనిపించినా కూడా తెర వెనుక వారు కూడా అందరిలనే కొన్ని సమస్యలను తరచుగా ఎదుర్కొంటూ ఉంటారు. కొంతమందికి ఎంత డబ్బులు ఉన్నా కూడా నయం చేయలేని జబ్బులు వారిని ఇబ్బంది పెడుతూనే ఉంటాయి. అలాగే ఇటీవల ఒక హీరోయిన్ తన దీర్ఘకాలిక వ్యాధి గురించి చెప్పుకుని ఎవరు తప్పుగా అర్థం చేసుకోవద్దని ఒక వివరణ అయితే ఇచ్చింది. ఇష్క్ విష్క్' 'ఢిల్లీ బెల్లీ' సినిమాలతో బాలీవుడ్ లో గుర్తింపు పొందిన నటి షెనాజ్ ట్రెజరీ తన వ్యాధి గురించి సోషల్ మీడియాలో పేర్కొంది. ఈ 40 ఏళ్ల నటి ప్రోసోపాగ్నోసియా అనే వ్యాధితో ఇబ్బంది పడుతున్నట్లు చెప్పుకొచ్చింది. అది ఎలాంటి వ్యాధి అంటే ఎవరైనా వ్యక్తిని కొత్తగా కలిసినప్పుడు ఆ తర్వాత మళ్లీ అతన్ని గుర్తుపట్టలేనంతగా ఉంటుంది అని కొన్నిసార్లు తరచుగా కలిసే వ్యక్తిని కూడా చాలా ఈజీగా మర్చిపోతూ ఉంటాను అని ఈ బ్యూటీ తెలియజేసింది. ఇక ఈ వ్యాధి కారణంగా మనుషులను చాలాసార్లు గుర్తుపట్టలేని సమయంలో ఎదుటివారు తనకు పొగరు అని అనుకున్నారు అని కొన్నిసార్లు అయితే మొహం మీదే ఆ విషయాన్ని కూడా చెప్పినట్లుగా తెలియజేసింది. కానీ నా పరిస్థితి గురించి వారికి వివరణ ఇచ్చేవరకు అర్థమయ్యేది కాదని ఈ విషయంలో కొన్నిసార్లు నేను మానసికంగా ఆందోళన కూడా చెందానని షెనాజ్ ట్రెజరీ పేర్కొంది. మొదట నేను ఇలా ఎందుకు జరుగుతుంది అని వైద్యులను అడిగినప్పుడు



కొన్ని పరీక్షలు చేసిన అనంతరం వ్యాధి గురించి బయటపడినట్లుగా ఈ బ్యూటీ తెలియజేసింది. మెదడుకు సంబంధించిన ఈ వ్యాధి కొంతమంది ముఖాలను గుర్తుపట్టలేని విధంగా చేస్తుందని అయితే వారి హెయిర్ స్టైల్ చూసి గుర్తుపట్టే విధంగా మాత్రం అవకాశం ఉంటుంది అని వివరణ ఇచ్చింది. అయితే నెక్స్ట్ టైం వచ్చినప్పుడు ఆ వ్యక్తి తన హెయిర్ స్టైల్ మార్చుకుంటే మాత్రం మళ్ళీ మర్చిపోతాను అని కూడా షెనాజ్ ట్రెజరీ తెలియజేసింది.




# స్విమ్మింగ్ లో షామా సోయగాలు



దాదాపుగా పాతిక సంవత్సరాల క్రితం ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ షామా సికిందర్. హీరోయిన్ గా చేసిన ప్రయత్నాలు విఫలం అవ్వడం తో బుల్లితెరపై కూడా తన అదృష్టం ను పరీక్షించుకుంది. 2003 సంవత్సరంలో యే మేరీ లైఫ్ హై తో సోనీ టీవీ ద్వారా బుల్లి తెర ప్రేక్షకులకు చేరువ అయిన ఈ అమ్మడు తక్కువ సమయంలోనే మంచి పాపులారిటీని దక్కించుకున్నాడు. సోనీ టీవీలో ప్రసారం అయిన ఎన్నో షోలు మరియు సీరియల్స్ లో మెప్పించిన ముద్దుగుమ్మ షామా సికిందర్ ఆకట్టుకునే అందం తో పాటు నటన విషయంలో కూడా విమర్శకుల ప్రశంసలు దక్కించుకుంది. నటిగానే కాకుండా మోడల్ గా కూడా సుధీర్ఘమైన కెరీర్ ను కొనసాగించిన ఈ అమ్మడు ముందు ముందు మరింతగా ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధం అన్నట్లుగా ఉంది. నాలుగు పదుల వయసులో పడ్డా కూడా షామా సికిందర్ అందాల ఆరబోత ఏమాత్రం తగ్గలేదు. పై పెచ్చు ఈమధ్య కాలంలో ఈ అమ్మడి సోషల్ మీడియా ఫోటోలు కుర్రకారులో సైతం హీట్ ను పెంచుతున్నారు. పాతికేళ్ల ముద్దుగుమ్మకు ఏమాత్రం తగ్గకుండా కళ్లు పెద్దవి చేసి మరీ చూసే విధంగా ఈ అమ్మడి అందాల ఆరబోత ఉందంటూ కామెంట్స్ వస్తున్నాయి. తాజాగా స్విమ్మింగ్ పూల్ లో పింక్ బికినీ లో క్లీవేజ్ షో చేస్తూ మతులు పోగొట్టే విధంగా అందాల ప్రదర్శణ చేసిన ఈ అమ్మడి ఫోటోలు వైరల్ అవుతున్నాయి. చాలా రోజులుగా ఈ అమ్మడి హాట్ ఫోటోలు రెగ్యులర్ గా సోషల్ మీడియాలో సందడి చేస్తున్నాయి.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com